క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించాలి

మునగపాక: స్థానిక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రహదారులు, డ్రెయిన్లు వంటి పనులు చేపట్టామన్నారు. అర్హులైన కూలీలకు ఈ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు అవకాశం కల్పించామన్నారు. ఏపీవో శివ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెద్దలు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశురామ్, బొడ్డేడ అప్పలనాయుడు, దాడి శివ, బీలా లక్ష్మణరావు, సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మునగపాకలో శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పూడిమడక రోడ్డు విస్తరణ పనులతోపాటు నూతనంగా నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా రహదారి ఏర్పాటుకు అవసరమయ్యే చర్యలు గురించి అధికారులతో మాట్లాడారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాక పాత బ్రిడ్జిని తొలగించి మరొకటి ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు మెరుగైన పరిహారం అందజేస్తామన్నారు. రహదారి విస్తరణకు సహకరించాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీధర్, స్థానికులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వమ్మవరం, ఎస్.రాయవరం ఫీడర్ పరిధిలో మరమ్మతులు నిమిత్తం పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం కుండల దేవునిపాలెంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు గదులు, కంప్యూటర్ రూమ్, లైబ్రరీల నిర్మాణానికి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.71.48 లక్షలతో చేపట్టనున్న నూతన భవన నిర్మాణాల ద్వారా నాణ్యమైన విద్య అందుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

సుపరిపాలనలో తొలి అడుగు

అచ్యుతాపురం: కూటమి పాలనలో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ నేత కాండ్రేగుల అప్పారావు తెలిపారు. మండలంలోని హరిపాలెంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాండ్రేగుల వాసు, కాండ్రేగుల వెంకటరమణ, సూరిసెట్టి అప్పలనాయుడు, కేవీఎస్ అప్పారావు, తాతాబాబు, మల్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మల తొలగింపు

యలమంచిలి రూరల్: పట్టణ పరిసర గ్రామాల్లో జంగిల్ క్లియరెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ వైర్లకు తగులుతూ ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, తీగజాతి మొక్కలను కాంట్రాక్టు సిబ్బంది తొలగించారు. వర్షాకాలంలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం ఈ చర్యలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో విద్యుత్ స్తంభాలను తీగజాతి చెట్లు, చెట్ల కొమ్మలు కమ్మేసిన విషయంపై ఇటీవల కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు స్పందించి, ఈ చర్యలు తీసుకున్నారు.

గిరి ప్రదక్షిణలో ఆర్టీసీ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

సింహాచలం: గిరి ప్రదక్షిణలో భక్తులను వారి గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ అత్యుత్తమ సేవలందించిందని సంస్థ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. గిరిప్రదక్షిణలో అత్యుత్తమ సేవలందించిన ఉద్యోగుల అభినందన సభ సింహాచలం ఆర్టీసీ డిపోలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అప్పలనాయుడు మాట్లాడుతూ సింహాచలం కొండ పైనుంచి దిగువకు 55 బస్సులు షటిల్ సర్వీసులుగా నడిపామని, నగర వ్యాప్తంగా 150 బస్సులు తిప్పినట్లు పేర్కొన్నారు. ఉత్తమ సేవలందించిన సింహాచలం డిపో కండక్టర్లు ఎల్‌వి కుమార్, కేఎన్ రాజు, డ్రైవర్లు ఆర్ఆర్ నాయుడు, ఎంఈ రావు, సీహెచ్ నాయుడులను అభినందించారు.



శిథిలమైన పాత వ్యవసాయ కార్యాలయ భవనం



ప్రమాద స్థితిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

శిథిల భవనాలు.. అరచేతిలో ప్రాణాలు

• ప్రమాదకరంగా సర్కారు భవనాలు • పెచ్చులూడి పడుతున్న శ్లాబ్‌లు, స్తంభాలు • భీతిల్లుతున్న ప్రజలు, విద్యార్థులు

కోటవురట్ల: శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు భయపెడుతున్నాయి. వీటిల్లో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకపోయినా ప్రాణసంకటంగా మారాయి. నిత్యం వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చేవారు మధ్యాహ్నం సమయాల్లో ఈ భవనాల చెంత కాస్త సేద తీరే అవకాశముంది. ఆ సమయంలో భవనం కూలితే ప్రాణాలు పోయే ప్రమాదముంది. ఇప్పటికే పలు భవనాలు కొంచెం కొంచెంగా కూలిపోతున్నాయి. వీటి స్థానంలో కొత్తవి నిర్మించినప్పటికీ అధికారులు పాతవి కూల్చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాంతో ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో ప్రమాదకరంగా పాత సమావేశ మందిరం

శిథిలమైన ప్రమాదకర భవనాలివే..

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పాత సమావేశ మందిరం శిథిలం కావడంతో 15 ఏళ్ల క్రితం కొత్తది నిర్మించారు. అప్పటి నుంచి పాత భవనం పెచ్చులూడి పడుతూ స్తంభాలు పగిలిపోయి ప్రమాదస్థితికి చేరుకుంది. దీనికి సమీపంలోనే పౌరసరఫరా గిడ్డంగి, వ్యవసాయ కార్యాలయం ఉండడంతో పలువురు వాటి పనులపై వచ్చేవారు ఈ భవనం కింద సేద తీరుతున్నారు. సెలవుల్లో పిల్లలు క్రికెట్ ఆడుతూ ఈ భవనం కింద సంచరిస్తుంటారు. అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

➡ మండల పశు సంవర్ధక శాఖ కార్యాలయం పక్కన పాత వ్యవసాయ కార్యాలయం భవనం పూర్తిగా శిథిలమై పెంకులు ఊడి పడుతున్నాయి. ఇందులో విష సర్పాలు సంచరిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సమీపంలో పలువురు పాడి రైతులు, మండల పరిషత్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చేవారు సంచరిస్తారు. భవనం పైకప్పు కూలితే ప్రమాదం తప్పదు.

➡ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాత భవనాలు శిథిలం కావడంతో కొత్త భవనాన్ని 15 ఏళ్ల క్రితం నిర్మించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు పాత భవనం వద్ద ఆటలాడుతూ కాలక్షేపం చేస్తుంటారు. ఇప్పటికే ఈ భవనం చాలా వరకు కూలిపోయింది. అయినా అధికారులు ఈ భవనాన్ని తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదం జరగకముందే శిథిల భవనాలను తొలగించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

పాత సమావేశ మందిరాన్ని తొలగించాలి



పాత సమావేశ మందిరం పూర్తిగా శిథిలమైంది. ప్రమాదం జరగక ముందే దీనిని తొలగిస్తే మంచిది. ఈ ప్రాంతంలో సెలవుల్లో విద్యార్థులు తిరుగుతుంటారు. గిడ్డంగిలో పనిచేసే కార్మికులు ఇక్కడ వేచి ఉంటారు. ఏ క్షణంలో నైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– ఆర్ఎస్ సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, తంగేడు

పాఠశాల వద్ద ప్రమాదస్థితి ఉంది

ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రమాద స్థితి ఉంది. పాత భవనం చాలా వరకు కూలిపోయినా దానిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. విద్యార్థులు దీనికి సమీపంలోనే సంచరిస్తుంటారు. ప్రమాదం జరగకముందే శిథిల భవనాలను తొలగించాలి.

– గెద్దమూరి రమణ, కోటవురట్ల

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

శిథిల భవనాల చెంత ప్రజలు వెళ్లకుండా జాగ్రత్త పడాలి. పాత భవనాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. కూల్చేయాల్సి వస్తే అధికారుల అనుమతి వచ్చాక చర్యలు చేపడతాం.

– చంద్రశేఖర్, ఎంపీడీవో, కోటవురట్ల మండలం

దుర్గాదేవి ఆలయంలో హరి భజన



దుర్గాదేవి ఆలయంలో హరిభజన చేస్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: మండలంలోని పద్మనాభరాజుపేట ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్విరామంగా హరి భజన కార్యక్రమం నిర్వహించారు. ఏటా ఆషాఢమాసంలో ఇక్కడ బయ్యవరం, పద్మనాభరాజుపేట గ్రామాల ప్రజలు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండు గ్రామాల్లో మహిళా హరిభజన బృందాలు చేపట్టిన కార్యక్రమాన్ని పద్మనాభరాజుపేట సర్పంచ్ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆషాఢ, శ్రావణ మాసాల్లో ప్రతి శుక్రవారం ఆలయంలో హరి భజన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ పెద్దలు ఎడ్ల పెద గోవిందరావు, హరి భజన బృందాల గురువులు మొగ్గ గోవిందరావు, ఈదలాడ సత్యనారాయణ, జీ లక్ష్మణ, ఎడ్ల చిన గోవిందరావు, సేనాపతి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా భగీరథమ్మ



అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెంలో భగీరథమ్మ శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే శుక్రవారం రోజున అమ్మవారిని విజయవాడ కనకదుర్గమ్మ తరహాలో ప్రత్యేకంగా అలంకరించడం ఆనవాయితీ. ఈ మేరకు పలు రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించి భక్తులు దర్శనభాగ్యం కల్పించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి



శిక్షణకు హాజరైన సచివాలయ ఉద్యోగులు

మునగపాక: పంచాయతీల అభివృద్ధిపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మండల పరిషత్ హాలులో శుక్రవారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలకు సంబంధించి ఈవోపీఆర్డీ సోమరాజు అవగాహన కల్పించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. శిక్షణాధికారులుగా సంతోష్, కేటీ రమణ వ్యవహరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి రైతుల డిమాండ్లు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి

కశింకోట: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసిత రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి తెలిపారు. మండలంలోని ఉగ్గినపాలెంలో సుజల స్రవంతి ప్రాజెక్టులో భూములు కోల్పోయే రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. భూసేకరణకు ధర విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరాకు మార్కెట్ ధర ప్రకారం రూ.45 లక్షలు ఉంటుందని అంచనా అన్నారు. దీనికి రెండున్నర రెట్లు వంతున భూమి కోల్పోయే వారికి ప్రభుత్వం పరిహారం అందించడానికి అవకాశం ఉందన్నారు. అయితే రైతులు దీన్ని మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతుల సమక్షంలో భూముల సర్వే చేసి హద్దులు నిర్ణయించిన తర్వాత వారితో మళ్లీ సమావేశమై అనంతరం భూసేకరణ చేపడతామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, టీడీపీ మండల నాయకుడు కలగా సోమేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అసకపల్లిలో ఆక్రమణల తొలగింపు



అక్రమ నిర్మాణ తొలగింపులో రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అసకపల్లిలో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. రెవెన్యూ పరిధి సర్వే నెం.1లోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదు మేరకు తొలగింపు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భూ కబ్జా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ వీరయ్య, వీర్వోలు ఉన్నారు.

15న మున్సిపల్ కార్మికుల ఆందోళన

• కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ వర్కర్స్ సంఘం నాయకులు

తుమ్మపాల: మున్సిపల్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లింపుతోపాటు, గత ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల హామీల ప్రకారం కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను, రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ వెంటనే విడుదల చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే, మరోపక్క కూటమి ప్రభుత్వం వారి పని గంటలు పెంచి పరోక్షంగా వేతనాలు కుదించేందుకు మంత్రివర్గ సమావేశంలో తీర్మానాలు చేయడం తగదన్నారు. ఇంజనీరింగ్ పార్క్, కూలీలకు ఆఫీస్ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా రూ.21 వేలు, రూ.24,500 వేతనాలు అందివ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటైర్‌మెంట్, మరణించిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి పనులు కల్పించాలన్నారు.

డైలీ వేజ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులందరినీ ఆప్కోస్‌లో కలిపి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హామీలు అమలు కాని క్రమంలో ఈ నెల 15న విజయవాడలో తలపెట్టిన ఆందోళనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిమ్మకాల నర్సింహామూర్తి, బంగారు రవికుమార్, సింగంపల్లి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు జన్మదినం



అచ్యుతాపురం క్యాంప్ కార్యాలయంలో కేక్ తినిపించుకుంటున్న వైఎస్సార్ సీపీ నేతలు



మునగపాకలో మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు జన్మదిన కేక్ కట్ చేస్తున్న దృశ్యం

యలమంచిలి రూరల్: యలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జన్మదిన వేడుకలు శుక్రవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. కన్నబాబురాజుకు హ్యాపీ బర్త్ డే అంటూ కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, వార్డు కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, కోరుబిల్లి శ్రీను, రాపేటి సంతోష్, కొఠారు కొండబాబు, ఈరిగిల గణేష్, నాయకులు బొద్దపు సత్యనారాయణ, మడుగుల సత్యనారాయణ, బీరువాల రాము, పిల్లా త్రినాథరావు, కాళ్ల సీతారాం, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, మోహన్, ఈరిగిల చంటి, పోలరౌతు స్వామి, సత్యనారాయణ(పండు) బోదెపు ఉమ, వియ్యపు గోపి పాల్గొన్నారు.

అచ్యుతాపురం: యలమంచిలి మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు జన్మదిన వేడుకలు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకున్నారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షుడు బుజ్జి, గంగూలి, ఎంఎస్, రాజాన చిట్టమ్మ పాల్గొన్నారు.

మునగపాక: యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఎంతో కృషి చేశారని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రమణమూర్తిరాజు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, చూచుకొండ సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, బొడ్డేడ బుజ్జి, కాండ్రేగుల కిరణ్‌కుమార్, పార్టీ నేతలు మందా రాము, కాండ్రేగుల చందు, శ్రీరామమూర్తి, మొల్లేటి నాయుడు, బొడ్డేడ చెల్లయ్యనాయుడు, బొడ్డేడ లిల్లీ, పల్లెల ప్రకాశరావు పాల్గొన్నారు.

పొగాకు తాగితే వ్యాధులు



ర్యాలీని నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు

అనకాపల్లి: పొగాకు తాగడం వల్ల వివిధ రకాల వ్యాధులు బారినపడే అవకాశాలు ఉన్నాయని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి నుంచి నెహ్రూచౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు సేవించిన వారి కంటే పొగను పీల్చిన వ్యక్తులు కూడా వ్యాధులు బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్తేరు రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఏకాహ భజన

కశింకోట: స్థానిక గవరపేటలోని ఆశ్రమంలో హరి నామ స్మరణతో నిర్వహించిన ఏకాహం భజన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. గురుపౌర్ణమి పురస్కరించుకొని జరిగిన కార్యక్రమం అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నారుమడికి పైపాటుగా యూరియా వాడకం

అనకాపల్లి: ఐదు సెంట్ల వరి నారుమడి వేసిన 12–14 రోజులకు పైపాటుగా 2.5 కిలోల యూరియా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారుమడి వేసిన 15 నుంచి 20 రోజులకు సెంటుకు 160 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి. రాగల ఐదు రోజులు అధిక ఉష్ణోగ్రతలు, తేలికపాటి జల్లులు ఉండే అవకాశం ఉన్నందున అవసరానికి మేరకు నీటి తడులు ఇవ్వాలి. నేరుగా వరి విత్తే పద్ధతిలో కలుప సమస్య అధికంగా ఉంటుంది. 20 రోజుల వరి పైరులో గడ్డి, వెడల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు, బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మి.లీల చొప్పున పిచికారీ చేయాలి. గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫైనోక్సాప్రోప్ పి ఇథైల్‌ను 350 మి.లీల చొప్పున ఎకరా పొలంలో పిచికారీ చేయాలి. పదును చూసుకుని మొదటి దఫా యూరియా ఎకరాకు 25 కిలోల చొప్పున విత్తిన 15 నుంచి 20 రోజులకు వేసుకోవాలి. మొక్కజొన్నలో అధిక దిగుబడినిచ్చే రకాలను కాని హైబ్రీడ్లను కాని వేసుకోవాలి. 30 రోజుల వయసు గల సజ్జ పైరులో 35 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. కాయ తొలుచు పురుగు నివారణకు క్లొరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో నువ్వు పైరులో రసంపీల్చు పురుగులు ఆశించి వెర్రి తెగులును వ్యాప్తి చేసే అవకాశం ఉందని, నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీటి ఎద్దడి లేకుండా తేలికపాటి తడి ఇవ్వాలి. చెరకులో ఆకు తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగులు పెరిగే అవకాశం ఉన్నందున్న డైమిథోయేట్ 2 మీ. లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

టోల్ బూత్‌ను ఢీకొట్టిన లారీ



ఢీకొట్టిన లారీ

నక్కపల్లి: వేంపాడు టోల్‌ప్లాజాను శుక్రవారం లారీ ఢీకొట్టింది. విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి టోల్ బూత్‌ని ఢీకొట్టాడు. ఆ సమయంలో టోల్ బూత్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

• మొగలిపురం పర్యటనలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి



పారిశుధ్య నిర్వహణపై గ్రామస్తులు, అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత కావాలని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని మొగలిపురంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై అధికారులను ఆరా తీశారు. రక్షిత మంచినీటి పథకం, డ్రైన్‌ల నిర్వహణ, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, నిలిచిన జల్ జీవన్ మిషన్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి అభివృద్ధి పనులను సమీక్షిస్తూ, పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్డీ డి.చైతన్య పాల్గొన్నారు.